ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 26 ఫిబ్రవరి 2024







ఎండిపోతున్న ఉల్లిపంట

# బోరుమంటున్న అన్నదాతలు

## అడుగంటుతున్న బోరుబావులు

- ఎండిపోతున్న పంటలు
- ట్యాంకర్లతో పంటలకు నీటి తడులు
- బోరు వేసినా చుక్కనీరు రాని వైనం
- అనధికార విద్యుత్ కోతలతో అవస్థలు
- లక్షల పెట్టుబడి నష్టపోతున్న రైతులు

**కళ్యాణదుర్గం:** జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. దీంతో బోరుబావుల కింద పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తమ బోర్లు ఎండిపోతాయేమోనని వారు భయపడుతున్నారు. ఇప్పటికే బోరుబావుల్లో అరకొర నీరు వస్తుండటంతో సాగు చేసిన పంటలకు చాలీ చాలని తడులు ఇస్తున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ దుర్గం నియోజకవర్గంలో ఉల్లి, మిరప పంటలను కాపాడుకు నేందుకు కొందరు రైతులు నీళ్ల ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకుంటు న్నారు.

● మంగళకుంట గ్రామానికి చెందిన దాసరి నారాయణ అనే రైతు నాలుగు నెలల కిందట తనకున్న నాలుగు ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. అప్పులు చేసి సుమారు రూ.లక్ష పంటకు పెట్టుబడి పెట్టారు. మందులు పిచికారి చేసి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. ఆఖరి దశలో తన బోరుబావిలో నీళ్లు అడుగంటి పోయాయి. కళ్లముందే పంట నిట్టనిలువునా ఎండి పోతోంది. పంటను కాపాడుకోవాలని నీళ్ల ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకుని తడులు ఇస్తున్నాడు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1000 ప్రకారం నీటిని కొనుగోలు చేసి వారానికి ఒక్కరోజు చొప్పున పంటకు వదులుతున్నాడు.

### పెట్టుబడి వస్తుందో.. రాదో?

పంట పెట్టుబడి కూడా వస్తుందో రాదో తెలియని అయోమయ పరిస్థితి నెల కొంది. సుమారు రూ. లక్ష పెట్టుబడి పెట్టాం. చివరికీ నీళ్ల ఎండిపోవడంతో ట్యాంకర్‌తో నీటిని కొనుగోలు చేసి పంటను కాపాడుకుంటున్నాం. చుక్కనీరు రాకపోవడంతో మాలాంటి సన్నకారు రైతులు ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

- దాసరి నారాయణ, ఉల్లి రైతు, మంగళకుంట, కళ్యాణదుర్గం మండలం





ఉల్లి పంటకు నీళ్లు పెట్టేందుకు పొలానికి ట్యాంకర్ తెచ్చిన రైతు దాసరి నారాయణ

### పంటను వదిలేశాం



కొద్ది రోజుల వరకు మిరప పంటకు ట్యాంకర్ నీరు పెట్టి బతికించుకునేందుకు ప్రయత్నాలు చేశాం. చివరికీ ఆ ట్యాంకర్ నీరు కూడా దొరకడం కష్టమైంది. విధిలేని పరిస్థితుల్లో పంటను పూర్తిగా వదిలేశాం. అప్పులు చేసి పంటను సాగు చేస్తే, ఆఖరి దశలో నట్టేట మునిగిపోయాం. సుమారు రూ.4లక్షలు నష్టపోయాం. వ్యవసాయాన్నే నమ్ముకున్న మా లాంటి రైతులు ఎలా బతకాలో !.

- మహేష్, ఓబిగానిపల్లి, కంబదూరు మండలం

● కంబదూరు మండలంలోని ఓబిగానిపల్లికి చెందిన రైతు మహేష్ తనకున్న నాలుగు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాడు. పంట సాగుకు సుమారు రూ. 4 లక్షలు పెట్టుబడి పెట్టాడు. పంట చివరి దశలో బోరుబావి ఎండిపోవడంతో ట్యాంకర్‌తో నీళ్లను పెట్టుకుని పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు. చివరికి ఆ ట్యాంకర్‌కు కూడా నీళ్ల దొరకకపోవడంతో పంటను వదిలేశాడు. దీంతో రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. తాగడానికి కూడా నీళ్ల దొరికే పరిస్థితులు లేవని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు.



### సతమతమవుతున్నాం



అనధికార విద్యుత్ కోతలతో సతమతమవుతున్నాం. విద్యుత్ ఎప్పుడు వస్తుందో...ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఒక్కోసారి సాగుచేసిన పంటలకు పురుగు మందు పిచికారి చేసే సమయంలో విద్యుత్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్ అధికారులకు విన్నవించిన ఫలితం లేదు. ఇటీవలే రాత్రి 11 సమయంలో రైతులందరం కలిసి కల్లూరు సబ్‌స్టేషన్‌ను కూడా ముట్టడించాం.

- రైతు లింగమయ్య, ఇల్లూరు



నీరు లేక వదిలేసిన వేరుశనగ

**గార్లదిన్నె:** మండలంలోని వ్యవసాయ బోరుబావుల్లో రోజురోజుకూ నీరు అడుగంటుతుండటంతో పండ్ల తోటలు, ఇతర పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ముకుందాపురం, గార్లదిన్నె, యర్రగుంట్ల, జంబులదిన్నె, కనుంపల్లి, పెనకచెర్ల, పాపినేపాళ్యం తదితర గ్రామాల్లో చీనీ, దానిమ్మ, మామిడి తదితర పంటలను రైతులు సాగుచేశారు. రబీ సీజన్‌లో వేరుశనగ 900 ఎకరాలు, 1600 ఎకరాల్లో వరి, 280 ఎకరాల్లో మొక్క జొన్న ఇలా సుమారు 3900 ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న, టమోటా, బెండ తదితర పంటలను సాగుచేశారు. వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరుబావుల్లో నీరు రావడం లేదు. దీంతో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు రైతులను మరింత ఇబ్బందిపెడుతు న్నాయి.

● జంబులదిన్నెకు చెందిన రైతు కడంచు నాగేశ్వరరావు రబీలో సుమారు 9.5 ఎకరాలలో వేరుశనగ సాగు చేశాడు. దాదాపు 3 లక్షలు పెట్టుబడి పెట్టాడు. అయితే బోరుబావుల్లో వచ్చే నీరు రాకుండా పోయింది. కళ్ల ముందు ఎండిపోతున్న వేరుశనగ పంటను కాపాడుకునేందుకు మరో రెండు బోర్లు వేశారు. చుక్క నీరు పడకపోగా సుమారు రూ.2 లక్షల వరకు అప్పు అయింది. నెల ఉంటే పంట చేతికందేది. ఇంతలోనే బోరుబావుల్లో వస్తున్న నీరు రాకుండా పోయాయి. దీంతో ఆ రైతు దిక్కుతోచక వేరుశనగ పంటను వదిలేశాడు.

### నీళ్లు ఎప్పుడు నిలిచిపోతాయోనని భయమేస్తోంది



మాకున్న 9 ఎకరాలలో వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేసి జీవించేవాళ్లం. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు ఎప్పుడు ఇంకిపోతాయేనని భయమేస్తోంది. అందుకే ఇప్పుడు కేవలం ఎకర భూమిలో బెండ సాగుచేస్తున్నాం. - రైతు నాగభూషణం

### వ్యవసాయాన్నే నమ్ముకున్నాం

ఊహ తెలిసినప్పటి నుంచి వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్నాం. ప్రతి ఏడాది నష్టాలే మిగులుతున్నాయి. ఈ ఏడాది 9.5 ఎకరాలలో 3 లక్షలు ఖర్చు చేసి వేరుశనగ సాగు చేశా. ఉన్నట్లుండి రెండు బోర్లలో వచ్చే నీరు రాలేదు. మరో రెండు బోర్లు వేస్తే 2 లక్షలు ఖర్చు అయింది. అయినా నీరు పడలేదు. నీరు పడకపోవడంతో సాగు చేసిన వేరుశనగ పంటను వదిలేశా. - రైతు నాగేశ్వరరావు, జంబులదిన్నె



# ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

**27,326మంది హాజరు.. 5065మంది గైర్హాజరు**



అభ్యర్థులను తనిఖీచేసి కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 25:** జిల్లాలో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 32,397మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 111 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10-30గంటల నుంచి 1గంట వరకు పరీక్ష కొనసాగింది. అభ్యర్థులు ఉదయం 9గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 10-15గంటలవరకు ప్రతి ఒక్కరిని తనిఖీచేస్తూ కేంద్రాలలోకి అభ్యర్థులను పంపించారు. సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లు, ఇతర పరికరాలను ఆయా కేంద్రాల సిబ్బంది తీసుకుని ప్రత్యేక కౌంటర్‌లో భద్రపరచారు. ఈపరీక్షలకు 27,326మంది హాజరు కాగా, 6,065 మంది గైర్హాజరయ్యారని డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఏపీపీఎస్సీ సెక్రెటరీ అపరంజని తెలిపారు. ఎస్పీ అన్బురాజన్, డీఆర్‌ఓ, ఏపీపీఎస్సీ సెక్రెటరీ తదితరులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం మీద గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికారయంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

# రేపటి నుంచి టెట్ : డీఈఓ

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 25:** ఏపీ టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) ఈ నెల 27 నుంచి జరుగుతాయని డీఈఓ వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 6వ తేదీ వరకూ ఈ పరీక్షలు ఉంటాయన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిత్యం రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. అనంతపురంలో 6 కేంద్రాలు, తాడిపత్రిలో 2 కేంద్రాలు, బెంగళూరులో 4 కేంద్రాలు, గుత్తి, పుట్టపర్తిలో ఒక్కోటి చొప్పున పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లు, గుర్తింపుకార్డు దగ్గర ఉంచుకుని గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల పూర్తి వివరాల కోసం http://deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

# జగన్‌ను గద్దె దించడమే ధ్యేయం

**అన్ని పార్టీలదీ అదే లక్ష్యం**

- బీజేపీ పొత్తులో ఉండాలని కోరుకుంటున్నా
- మొదటి జాబితాలో గెలుపే ధ్యేయంగా టిక్కెట్లు
- ఉమ్మడి అనంత జిల్లాలో 12 సీట్లు గ్యారెంటీ
- ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి దుర్మార్గం

**మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి**



మీడియాతో మాట్లాడుతున్న జేసీ దివాకర్‌రెడ్డి

**అనంతపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌ను గద్దెదించడమే అందరి ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ది ఒక్కటే ధ్యేయమన్నారు. ఈసారి జగన్‌ను గద్దెదించేందుకు ఎన్ని త్యాగాలకైనా వారు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. మొదటి జాబితాలో గెలుపే ధ్యేయంగా టికెట్లు కేటాయించినట్లు స్పష్టంగా కనిపించిందన్నారు. ఈ జాబితాలో చంద్రబాబుకు అత్యంత ఆత్మీయులకు కూడా టిక్కెట్లు దక్కలేదన్నారు. పొత్తుల నేపథ్యంలో కొందరు ఆశలు తగ్గించుకోక తప్పదన్నారు. టిక్కెట్లు రాని వారి అసంతృప్తి మరో పది రోజుల్లో తగ్గిపోతుందన్నారు. టిక్కెట్ రాని నాయకులు, వచ్చిన నాయకులు, తన లాంటి వారందరి ధ్యేయం జగన్‌ను గద్దె దించడమేనని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ రావాలని తాము కోరుకుంటున్నామన్నారు. ఓట్లు చీలిపోకూడనే పొత్తులు ఉండాలని ఆశిస్తున్నామన్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం లక్ష్యం కూడా జగన్ అరాచక పాలనను గద్దె దింపడమేనన్నారు. కాంగ్రెస్‌తో వామపక్షాలు పొత్తులో ఉన్నా మెజార్టీ ఓట్లు తమ పార్టీకే వేస్తారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు సమిష్టిగా ప్రకటించిన అభ్యర్థుల మొదటి జాబితాను తాను స్వాగతిస్తున్నానన్నారు. తన కుమారుడికి అనంతపురం ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని తాము అడిగిన మాట వాస్తవమేని, అయితే ఇస్తారో లేదో ఇంకా స్పష్టత లేదన్నారు. కుటుంబానికి ఒకటే సీటు అని మాకు చంద్రబాబు చెప్పలేదన్నారు. కుటుంబం అంటే తల్లి, తండ్రి, కుమారుడ న్నారు. అన్నదమ్ములను ఒకే కుటుంబం అనేది రాదన్నారు. అనంత ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ సీట్లల్లో ఒకటి, రెండు పోయినా 12 సీట్లు గ్యారెంటీగా టీడీపీకి వస్తాయన్నారు. జగన్ సిద్ధం సభలకు ఇతర జిల్లాల నుంచి సొంత డబ్బు ఖర్చులు పెట్టుకొని జనం వచ్చే పరిస్థితి లేదన్నారు. మద్యం, బిర్యానీతోపాటు జేబులోకి డబ్బులు పెడితేనే జనం వచ్చారన్నారు. అధికారం చేతిలో ఉంది కాబట్టి ఆర్టీసీ, ప్రైవేటు బస్సులన్నీ ఉచితంగా వస్తాయన్నారు. రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ పై దాడి దుర్మార్గమన్నారు. ఎన్నికల్లోనూ ఇది కొనసాగే పరిస్థితులు ఉన్నాయన్నారు. పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. ప్రభుత్వం మారు తుందని తెలిస్తే పోలీసుల వ్యవహారాలు మారుతాయని, రాబోవు ఎన్నికల్లో పోలీసు వ్యవస్థ వన్‌సైడ్‌గా ఉండే పరిస్థితి లేదన్నారు. జగన్ పాలన హిట్లర్ నియంత పాలనగా ఉందన్నారు. నియంత పాలన ఉండకూడదనే వైఎస్ షర్మిల బయటకొచ్చిందన్నారు. తాడిపత్రిలో ఈ సారి తప్పకుండా గెలుస్తామన్నారు. వైసీపీ పాలనలోని పథకాలను టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగించి, అంతకంటే మేలైన కొత్త పథకాలు అమలు చేస్తారని తెలిపారు. జగన్ పాలన అధ్వానంగా ఉందన్నారు. రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. చాగల్లు డ్యాంలో నీళ్లు వృథాగా వదిలిపెట్టడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. ఇసుక అక్రమ రవాణాతో నదిలో గుంతలు పడ్డాయని, ఆ గుంతలు పూడిపోయేందుకు డ్యాంలోని నీళ్లు వృథాగా వదిలిపెట్టారని మండిపడ్డారు. వేసవిలో ట్యాంకర్లు పెట్టినా తాగునీటి సమస్య తీరుతుందో లేదో జగన్‌నే చెప్పాలన్నారు. షర్మిల ఒక ప్రయత్నం చేస్తోందని, మొట్టమొదటే మేల్కొని ఏపీలో తిరిగి ఉంటే పరిస్థితులు వేరుగా ఉండేదన్నారు. ఆమె తెలంగాణలో పార్టీ పెట్టి ఆలస్యం చేసిందన్నారు.

# సిద్ధం అంటూ.. మీడియాపై యుద్ధం

● ప్రశ్నించే గొంతులను నొక్కే పనిలో ప్రభుత్వం ● రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ● జర్నలిస్టులపై దాడి.. ప్రజాస్వామ్యానికి ప్రమాదం ● 'అక్షరం, కలంపై దాడి.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం' చర్చావేదికలో వక్తలు


చర్చావేదికలో ఐక్యత చాటుతున్న నాయకులు

**అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 25:** రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధం... సిద్ధం అంటూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై ఒక యుద్ధం చేశాడని పలు రాజకీయ, కుల, ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, మేధావి వర్గం నాయకులు మండిపడ్డారు. విధి నిర్వహణలో భాగంగా రాప్తాడు సిద్ధం సభకు వెళ్లిన శ్రీకృష్ణపై అమానుషంగా దాడి చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి వేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఫర్ ద సొసైటీ వ్యవస్థాపకుడు పోతుల రాధాకృష్ణ ఆధ్వర్యంలో 'అక్షరం మరియు కలంపై దాడి - ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే అంశంపై చర్చావేదికను ఏర్పాటు చేశారు. ఈ చర్చావేదికలో పలు రాజకీయ, కుల, ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఈ చర్చా వేదికలో ప్రొఫెసర్ సదా శివారెడ్డి, రాప్తాడు నియోజకవర్గ టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిలాన్, పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సిరాజ్, ముస్తఫా, కుమార్‌రాజా, ఎన్జీఓ నగర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు, టీడీపీ అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, బీసీ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు సురేష్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, సీపీఐ నాయకులు రమణయ్య, కాంగ్రెస్ నాయకులు శంకర్ పాల్గొన్నారు.

### ప్రభుత్వం వ్యక్తి నిర్మూలన కోరుకుంటోంది : పోతుల రాధాకృష్ణ, ఫర్ ద సొసైటీ వ్యవస్థాపకుడు



రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతుకలు, మేధావులను నక్స లైట్లు, తీవ్రవాదులుగా పరిగణించి కేసులు పెడుతుంటే... రాష్ట్ర ప్రభుత్వం సమాజాన్ని చంపుతూ... వ్యక్తి ని ర్మూలన కోరుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలపై దాడులు, బెదిరింపులు అధిక మయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంపై ఒత్తిడి తెస్తున్నాయి. జర్నలిస్టులపై దాడులకు తెగబడుతూ... భావప్రకటన స్వేచ్ఛను అణచివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య. శ్రీకృష్ణపై జరిగిన దాడి అమానుషం. రాష్ట్రవ్యాప్తంగా ఆ దాడిపై చర్చ జరుగుతున్నా... పాలకులు నోరు మెదపకపోవడం దారుణం. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఉందేమోనన్న భయం వేస్తోంది.

### ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది : అయూఫ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధానకార్యదర్శి



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోంది. ప్రభు త్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కడమే పనిగా పెట్టుకుంది. శ్రీకృష్ణ మీద అమానుషంగా దాడి చేయడం ఎంతో బా ధాకరం. ప్రభుత్వానికి మీడియా మీద ఎంత కసి ఉందో శ్రీకృష్ణపై జరిగిన దాడి అద్దం పడుతోంది. జర్నలిస్టులకు రక్షణగా చట్టాలు తీసుకురావాలి.

### మేధావుల మౌనంతోనే ఈ పరిస్థితులు..: రాజారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్రంలో మేధావులు మౌనం వహించడంతోనే నియంతృత్వ పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం జగన్ సిద్ధం... సిద్ధం అంటుంటే ఎన్నికలకు సిద్ధమవుతున్నాడని అనుకున్నాం. కానీ కలంపై కత్తి దూయడానికి సిద్ధం అని అనుకోలేదు. ఉద్యమాలు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు. దానిని అణచాలని చూస్తే ఎలా...? జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియంతృత్వ పోకడలకు పో తున్నారు. ప్రజాస్వామ్యంను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుంటోంది.

### కలం లేకుండా భవిష్యత్తు లేదు: రమణారెడ్డి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



కలం లేకుంటే భవిష్యత్తు లేదు. రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధమైన విధానాలను అవలంబిస్తోంది. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతోంది. ఉపాధ్యాయ, ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చలో విజయవాడకు పిలుపునిస్తే స్కూళ్లో ఉన్నా, ఊర్లో ఉన్నా, ఎక్కడున్నా నోటీసులు ఇస్తున్నారు. మీరు వెళ్ల కూడదు. వెళ్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని బెదిరిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలపై ఒత్తిళ్లు పెరిగిపోయాయి.

### మానవత్వం మంటగలిసేలా కొట్టారు: వెంకటేష్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి మానవత్వం మంటకలిసేలా ఉంది. శ్రీకృష్ణకి రాజకీయ పార్టీలకు ఏంటి సంబంధం..? ఇదేనా ప్రజాస్వామ్యమంటే..? ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉరవకొండ, కళ్యాణదుర్గంలో మా సమస్యలపై మాట్లాడుకునేందుకు కలిస్తే... సీఐలు, ఎస్ఐలు వచ్చి ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. సీఎంను కలిసి రెప్రజెంటేషన్ ఇద్దామనుకుంటే మాపై బైండోవర్ కేసులు పెడుతున్నారు. సీఎం జగన్ సిద్ధం.. సిద్ధం అంటున్నారు. నిన్ను ఇంటికి పంపేందుకు మేమూ కూడా సిద్ధంగా ఉన్నాం.

### అంతు చూస్తామన్న రీతిలో సీఎం జగన్ ప్రవర్తన: శంకర్, ఎంఈఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి



రాష్ట్రంలో ఎవరైనా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే నీ అంతు చూ స్తామన్న రీతిలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవర్తిస్తున్నాడు. శ్రీకృష్ణపై దాడి ఎంతో బాధ కలిగించింది. ఎంతో మంచి వ్యక్తి. పొట్టకూటి కోసం విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణలాంటి వ్యక్తులపై దాడి చేయడం అమానుషం. శ్రీకృష్ణపై జరిగిన దాడి బయటికి వచ్చిందికానీ... చాలాచోట్ల దాడులు బయటికి రావడం లేదు. మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరిగాయి. రాజశేఖర్‌రెడ్డి కొడుకు... మంచి చేస్తాడని సీఎంను చేస్తే మాపైనే దాడులు చేయిస్తున్నాడు. ఇలాంటి వ్యక్తిని వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది.

### సమాజానికి దిక్సూచి మీడియా: నాగేంద్ర యాదవ్, జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా అధ్యక్షుడు



సమాజానికి దిక్సూచి మీడియా. అలాంటి మీడియాపై దాడులు చేయడమంటే భావ ప్రకటన స్వేచ్ఛను దెబ్బ తీయడమే. రాజకీయ నాయ కుల చేతుల్లోకి మీడియా పోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. కొందరి వల్ల దాడులు అధికమయ్యాయి. వ్యవస్థకు తూట్లు పొడుస్తూ.. రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారు. శ్రీకృష్ణపై జరిగిన దాడి.. భవిష్యత్తులో మరెవరిపై జరగకుండా ప్రభుత్వాలు రక్షణ చట్టాలు తీసుకురావాలి.

### పాలకులు దౌర్జన్యాలు ఆపాలి : చంద్రమోహన్, ఏపీఎన్జీఓ జిల్లా ప్రధానకార్యదర్శి



పాలకులు దౌర్జన్యాలు, దాడులు ఆపాలి. శ్రీకృష్ణపై దాడి అమానుషం. పత్రికా స్వేచ్ఛకు ఎవరూ భంగం కలిగించకూడదు. దాడులు చేయడం బాధాకరం. దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. భవిష్యత్తులో జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలి.

### ప్రశ్నించే గొంతులు మూసుకుపోయే ప్రమాదం ఉంది: పుట్టా శ్రీధర్, బీసీ,ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి బాధాకరం. అంతమంది వచ్చి ఒక వ్యక్తిని కొడుతుంటే ప్రజాస్వామ్యం ఉందా అన్న సందేహం కలుగుతోంది. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులపై పాలకులు స్పందించకపోవడంతోనే దాడులు అధికమవుతున్నాయి. ఏం మాట్లాడాలన్నా.. ఎవరొస్తారో... ఏ సమస్య వస్తుందోనన్న భయానకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రశ్నించే గొంతుకలు మూసుకుపోయే ప్రమాదం ఉంది.

### మీడియాపై గుత్తాధిపత్యం కోసం పోరాటం: బండి నాగరాజు, అనంత విద్యావంతులు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు



రాష్ట్రంలో మీడియాపై గుత్తాధిపత్యం కోసం పోరాటం జరుగుతోంది. ప్రభుత్వం భయంతో జర్నలిస్టులను అణచివేయాలని చూస్తోంది. ప్రస్తుతం దేశంలో జర్నలిస్టుల స్వేచ్ఛ 170 స్థానంలో ఉంది. శ్రీకృష్ణపై జరిగిన దాడి సమాజం తలదించుకునేలా ఉంది. ప్రశ్నించే గొంతుకను నొక్కడమంటే ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసినట్లే. దీనిని ప్రతిఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి.

# నేడు కాంగ్రెస్ న్యాయ సాధన శంఖారావం సభ

● హాజరుకానున్న ఏఐసీసీ, పీసీసీ చీఫ్‌లు ● సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభం..

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25:** జిల్లా కేంద్రంలోని కొత్తూరు జూనియర్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ పార్టీ న్యాయసాధన శంఖారావం సభను సోమవారం నిర్వహించనుంది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, పార్టీ ప్రముఖ నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున జన సమీకరణ చేసి సభ విజయవంతం చేయడానికి స్థానిక నాయకులు ఎవరి పరిధిలో వారు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి జన సమీకరణ కోసం పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, శైలజానాథ్, గిడుగు రుద్రరాజుతో పాటు జంగా గౌతమ్ ప్రయత్నిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్రమైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద ఎత్తున జన సమీకరణకు చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభం కానుంది. రాష్ట్ర విభజనతో ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ అస్తిత్వం కోసం తీవ్ర ప్రయత్నం చేస్తోంది. ఈక్రమంలోనే జిల్లా నుంచి ఎన్నికల శంఖారావాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పూరించనున్నారు. ఈ సభతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మరో 4 ఎన్నికల సభలు నిర్వహించేలా నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ సభలకు పార్టీ అధికారంలో ఉన్న పొరుగు రాష్ట్రాల నుంచి ముఖ్య మంత్రులను, ఇతర నాయకులను పిలిపించి స్థానిక నాయకులు, కార్యకర్తల్లో ఉత్తేజం నింపే చర్యలకు పూనుకున్నారు. అనంతపురం సభ సక్సెస్‌పైనే ఇతర సభల నిర్వహణ ఆధారపడే అవకాశం ఉందన్న చర్చలు సాగుతున్నాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు..

# శ్రమదోపిడీ



● పారిశుధ్య కార్మికుల కడుపుకొడుతున్న కాంట్రాక్టర్ ● ఆర్టీసీ బస్టాండులో నిబంధనలు పాటించని వైనం ● చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25:** ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం బస్టాండులో పనిచేసే పారిశుధ్య కార్మికుల (స్వీపర్ల)కు తక్కువ వేతనాలు ఇస్తూ కాంట్రాక్టరు వారు కడుపుకొడుతున్నాడు. ఆర్టీసీ నిబంధనల మేరకు వారికి వేతనాలు ఇవ్వకుండా తన జేబును నింపుకుంటున్నాడు. దీన్ని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. 2022లో ప్రొద్దుటూరుకు చెందిన గంగరాజు అనే వ్యక్తి పారిశుధ్య కార్మికులచే బస్టాండులో పనులు చేయించే కాంట్రాక్టు దక్కించుకున్నాడు. అనంతపురం బస్టాండుకు మొత్తం 15 మంది కార్మికులను కేటాయించగా ఒక్కో కార్మికుడికి రూ.12వేలు చొప్పున ఆర్టీసీ వేతనం అందిస్తోంది. ఇందులో ఈఎస్ఐ, పీఎఫ్‌కు రూ.1500లు పోగా రూ.10,500 ఉంటుంది. ఆర్టీసీ నిబంధనల మేరకు ఈ రూ.10,500 కార్మికులకు చెల్లించాల్సింది. అయితే ఏజెన్సీ తరఫున కార్మికులను సరఫరా చేస్తున్నందున ఆ కాంట్రాక్టరు ఒక్కో కార్మికుడిపై రూ.500 కమీషన్ తీసుకున్నా రూ.10వేలు చొప్పున అయినా చెల్లించాలి. అయితే రూ. మూడు వేలు చొప్పున కమీషన్ తీసుకుంటూ రూ.7500లు మాత్రమే కార్మికులకు వేతనాలుగా చెల్లిస్తూ, వారి కడుపు కొడుతున్నాడు. దీనిపై కార్మికులు ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అనంతపురం డిపో పరిధిలోనే డిపో గ్యారేజీకి ఒక కాంట్రాక్టరు, ఆర్ఎం కార్యాలయానికి మరొక కాంట్రాక్టరు కార్మికులను సరఫరా చేసి వారికి ఒక్కొక్కరికి రూ.9500లు చొప్పు న వేతనాలు ఇస్తున్నారు. అయితే ఇదే డిపో ఆవరణలోనే ఉన్న బస్టాండుకు సంబంధించి కాం ట్రాక్టు దక్కించుకున్న గంగరాజు మాత్రం కార్మికుల వేతనంలో రూ.3వేలు కోత పెట్టి తన జేబు నింపుకుంటుండటం గమనార్హం.

**జీతాలు వేసినట్లే వేసి వెనక్కు...**

వేతనాల కోత విషయంపై కార్మికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గతంలో అధికారులు కాంట్రాక్టరును హెచ్చరించారు. దీంతో గత 5 నెలల నుంచి కార్మికుల ఖాతాల్లోకి రూ.9500లు చొప్పున వేతనాలు జమ చేయడం, కార్మికులందరినీ బ్యాంకుకు తీసుకెళ్లి ఖాతాల్లో నగదు డ్రా చేయించి, అందులో రూ.7500లు మాత్రమే వారి చేతికిచ్చి, మిగిలిన సొమ్ము తానే తీసుకెళ్లిపోతు న్నాడు. ఇదేంటని కార్మికులు ప్రశ్నిస్తే మిమ్మల్ని పనిలోనుంచి తొలగిస్తానంటూ బెదిరిస్తున్నాడని పలువురు కార్మికులు వాపోతున్నారు.

### కుటుంబ పోషణ కష్టంగా ఉంది: లక్ష్మీదేవి



మా ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న అత్త ఉంది. సాధారణం గానే రూ.7500లతో కుటుంబ పోషణ కష్టం. దీనికి తోడు పిల్లల చదువులు, మా అత్త ఆరోగ్యంకోసం వైద్య ఖర్చు లు వీటన్నింటి నడుమ జీవనం కష్టతరంగా మారింది. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఆర్టీసీ నిబంధనల మేరకు వేతనాలిస్తే ఇన్ని కష్టాలుండవు.

### విచారణ చేపడతాం: నాగభూపాల్, అనంతపురం డిపో మేనేజర్



కార్మికుల వేతనాల నుంచి కాంట్రాక్టరు డబ్బు తీసుకుంటున్న విషయం మా దృష్టికి వచ్చింది. మీరు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని కార్మికులకు సూచించాం. జీతాల సమస్య, కాంట్రాక్టరు తీరుపై విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకుంటాం.

### మమ్మల్ని తొలగించి బిహార్ వాళ్లతో పని చేయిస్తానంటున్నారు..: రామాంజనేయులు



మా కష్టానికి తగ్గ వేతనం ఇవ్వాలని కాంట్రాక్టరును అనేకసార్లు కోరాం. ఆర్టీసీ అధికారులు తెలిపిన మేరకు వేతనాలివ్వమని అడిగితే మిమ్మల్ని పనిలోనుంచి తొలగించి, బిహార్ కార్మికులతో పనిచేయిస్తా అంటూ కాంట్రాక్టరు బెదిరిస్తున్నాడు. నిరుపేద కార్మికులైన మా కష్టాన్ని కాంట్రాక్టరుతోపాటు ఆర్టీసీ అధికారులు గుర్తించాలి.

## 'చలో విజయవాడ' వాయిదా సహించం


మాట్లాడుతున్న నరసింహులు

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 25:** చలో విజయవాడ వాయిదా నిర్ణయం సరికాదని, దీన్ని సహించేది లేదని, ఏపీ జేఏసీ నిర్ణయాన్ని ముకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నామని ఏపీటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల పక్షాన సమస్యల పరిష్కారానికి నాయకత్వం వహిస్తున్న ఏపీ జేఏసీ అర్ధంతరంగా ఈ నెల 27న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఏపీ జేఏసీ నాయకులు ఒక అ జెండా, చిత్తశుద్ధి లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రెండుసార్లు చర్చలు జరిగి.... ఉన్నఫలంగా వాయిదా పేరుతో వెనక్కు తగ్గడం దారుణం అన్నారు. జిల్లా అధక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరి మారాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులతో, జేఏసీ నాయకులతో పూటకో మాట చెబితే చూస్తూ ఊరుకోమన్నారు. తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కలసి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చలో విజయవాడపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సతీష్, రామకృష్ణ, బాల రామ్మోహన్, రవికుమార్, వన్నప్ప, పుల్లయ్య, సర్దార్ వలి, చిదంబరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## భార్యను హత్యచేసిన భర్త


హరిలత మృతదేహం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి25:** స్థానిక జయనగర్‌కాలనీలో రామాంజనేయులు తన భార్య హరిలత (38) అలియాస్ అరుణ తలపై ఆదివారం రోకలిబండతో మోది హత్యచేశాడని పట్టణ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన రామాంజనేయులు, హరిలత.. ఇద్దరు పిల్లలతో కలిసి ఉపాధి కోసం తాడిపత్రికి వలస వచ్చారు. జయనగర్‌కాలనీలో నివాసం ఉండేవారు. రామాంజనేయులు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా రామాంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. దీంతో పలుచోట్ల అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్ల అధికం కావడంతో స్వగ్రామంలో ఉన్న మూడెకరాల భూమిని విక్రయించాడు. వచ్చిన డబ్బుతో అప్పులుతీర్చాడు. మిగిలిన డబ్బుతో జల్సా చేస్తుండటంతో భార్య మందలించింది. భార్యాభర్తల మధ్య మాటా మాటా పెరిగింది. కోపోద్రిక్తుడైన రామాంజనేయులు ఇంటిలోని రోకలి బండతో భార్య తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇంటర్ చదివే కుమారుడు ఫణీంద్ర, 8వ తరగతి చదివే కుమార్తె మానస ఉన్నారు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కుప్పకూలిన రథం

రథోత్సవంలో అపశ్రుతి.. అందరూ సురక్షితం..

**కుందుర్పి, ఫిబ్రవరి 25:** మండలంలోని అపిలేపల్లిలో బొబ్బళ్లకుంట ఆంజనేయ స్వామి రథోత్సవంలో ఆదివారం అపశ్రుతి తలెత్తింది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో వేలాది మంది భక్తులు కోలాహలంగా రథాన్ని లాగుతుండగా ఆంజనేయ స్వామి ఆలయానికి దగ్గరలో రథం కుప్పకూలింది. భక్తులు భయందోళనలతో హాహాకారాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు, గ్రామస్థులు ఎక్స్‌కవేటర్ సాయంతో రథాన్ని పైకి లేపారు. దాని కింద ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వంద సంవత్సరాల కిందట తయారు చేసిన రథం కావడం, వేలాది మంది భక్తులు భారీ ఎత్తున పూలహారాలను వేయడంతో ఆ బరువుకు తట్టుకోలేక రథానికి ఉన్న ఇనుప చువ్వలు ఊడిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.


రథాన్ని లాగుతున్న భక్తులు




కూలిన రథం, వేరుపడిన చక్రాలు, రథం


మాట్లాడుతున్న రుద్రరాజు, మయ్యప్పన్

## ఏపీలో మెరుగైన పథకాలు

### నేడు ప్రకటించనున్న ఖర్గే : రుద్రరాజు, మయ్యప్పన్

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25:** 'కర్ణాటకలో నాలుగు... తెలంగాణలో ఆరు ప్రజారంజక పథకాలను కాంగ్రెస్ అమలు చేస్తోంది. ఏపీలో ఇంతకన్నా మెరుగైన పథకాలను అమలు చేస్తాం. వాటిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం ప్రకటిస్తారు.' అని పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏపీ ఇన్‌చార్జ్ మయ్యప్పన్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే న్యాయ సాధన సభ ఏర్పాట్లను నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించిన వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని, 2024లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ తదితర వాటిని అమలు చేసి.. పూర్తి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సభకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సభకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షులు షర్మిల, పలువురు ఏఐసీసీ నాయకులు, పీసీసీ ఇన్‌చార్జ్‌లు, జిల్లాల ఇన్‌చార్జ్‌లు, ఇతర సీనియర్ నాయకులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, సీనియర్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్, జిల్లా నాయకులు వాసు, ఇమామ్, రాజేష్‌రెడ్డి ఎన్ఎస్‌యూఐ నాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

## మోదీ గెలుపు కోసం మహిళ బుల్లెట్ యాత్ర

### అనంతలో ఘన స్వాగతం


బుల్లెట్ యాత్రకు స్వాగతం పలుకుతున్న మహిళలు

**అనంతపురం సెంట్రల్ :** బీజేపీ, ప్రధాని నరేంద్ర గెలుపు కోసం తమిళనాడు మధురై ప్రాంతానికి చెందిన రాజ్యలక్ష్మి 'మోదీ ఫర్ ఓట్' పేరుతో చేపట్టిన బుల్లెట్ యాత్ర ఆదివారం నగరానికి చేరింది. ఆమెకు ఓం సంగీత నృత్యకోలాట శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు దేవరకొండ కౌశల్య ఘన స్వాగతం పలికారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... దేశానికి శుభీక్షపాలన అందిస్తున్న మోదీ.. రామరాజ్య స్థాపన దిశగా పనియస్తున్నారన్నారు. ఆయన గెలుపు కోసం ప్రతి మహిళా కృషి చేయాలని ఈ బుల్లెట్ యాత్ర చేపట్టానని తెలిపారు. అనంతరం కౌశల్యతో కలిసి రాజ్యలక్ష్మి ఇస్కాన్‌ఆలయంలోని రాధాకృష్ణలను దర్శించుకున్నారు.

### కన్నుల పండువగా శింగరప్పస్వామి తిరునాళ్ల



**గార్లదిన్నె, ఫిబ్రవరి 25 :** మండలంలోని కల్లూరు పెన్నానదీ పరివాహక ప్రాంతం కొండపైన వెలసిన క్షేత్రపాలకొండ (శింగరప్పకొండ) లక్ష్మిచెన్నకేశవస్వామి తిరునాళ్ళ ఆదివారం కన్నుల పండువగ జరిగింది. క్షేత్రపాలకొండపై లక్ష్మీచెన్నకేశవస్వామి, నరసింహస్వామి, సత్యనారాయణ, శివుడు, శింగరప్ప, ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఏటా మాఘమాసం నెలలో మూడో వారం స్వామివారి తిరునాళ్ళు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది మూడో ఆదివారం స్వామివారి తిరునాళ్ళు కన్నులపండువగా నిర్వహించారు. తిరునాళ్ళకు మండలం నుంచే కాకుండా ఇతర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో శింగరప్ప కొండ అవరణమంతా కిటకిటలాడింది.

### అశ్వత్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



**అనంతపురంరూరల్:** మండలంలోని సోమలదొడ్డి గ్రామ సమీపంలోని తడకలేరులో వెలసిన అశ్వత్థనారాయణస్వామి తిరుణాల వైభవంగా సాగింది. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పూలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూజ కార్యక్రమాలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. తినుబండాలు, పిల్లలకు ఆటవస్తువులు, మహిళలు గాజులు ఇతరాత్ర వస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు.

### అక్కమ్మగార్ల జాతర


కొలువుతీరిన అక్కమ్మగార్లు

మండలంలోని రాచానపల్లిలో వెలసిన అక్కమ్మగార్ల జాతర కన్నుల పండువగా సాగింది. ఆదివారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అక్కమ్మగార్లను కొలువుదీర్చారు. ప్రత్యేక అలంకరణ గావించి, భక్తులకు దర్శనానికి కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అక్కమ్మగార్లను దర్శించుకున్నారు. పూజా కార్యాక్రమాలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. జాతర కారణంగా ఆలయం పరిసరప్రాంతం అంతా భక్తులతో సందండిగా మారింది.

### 28న సైన్స్ డే పోటీలు

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 25 :** జిల్లాలోని అన్ని స్కూళ్లలో ఈ నెల 28వ తేదీ జాతీయ సైన్స్ డే పోటీలు నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్కూళ్లలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ఫాం ప్యానల్స్, స్మార్ట్ టీవీలను వినియోగించుకుని దేశంలో ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తల జీవిత విశేషాలను, ఆవిష్కరణలను, వారి శాస్త్రీయ దృక్పతాలను పిల్లలకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా 28వ తేదీ సైన్స్ క్విజ్, పాఠశాల స్థాయిలో సైన్స్ ఫెయిర్, సైన్స్ నాటికలు నిర్వహించాలని, 'ప్రపంచ గతిని మార్చిన సైన్స్ ఆవిష్కరణలు' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించాలన్నారు. అనంతరం సైన్స్ డే వేడుకలపై నివేదికను జిల్లా సైన్స్ అధికారికి పంపాలని సూచించారు.

### జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

**అనంతపురం క్లాక్‌టవర్:** స్థానిక అశోకనగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి తైక్వాండో ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని, ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 150 మంది క్రీడాకారులు హాజరయ్యారని డీఎస్‌డీఓ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, జిల్లా తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సభ్యులు

## వైసీపీని నమ్ముకున్నోళ్లు నష్టపోయారు

### గ్రామాల అభివృద్ధే టీడీపీ ధ్యేయం : మాజీ మంత్రి పరిటాల సునీత.. వైసీపీ మద్దతు సర్పంచు, మరో 10 కుటుంబాలు టీడీపీలో చేరిక


మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరిన సర్పంచ్, తదితరులు

**అనంతపురంరూరల్, ఫిబ్రవరి 25:** 'గత ఎన్నికల సమయంలో వైసీపీ గెలుపు కోసం ఆస్తులను అమ్మి పని చేసినవారంతా నేడు రోడ్డు పాలయ్యారు. వైసీపీ హయాంలో సర్పంచు మొదలుకొని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు వరకు గ్రామాల అభివృద్ధి సొంత డబ్బులు ఖర్చు పెట్టి అంతా అప్పుల పాలయ్యారన్నారు. గ్రామాల్లో ఎంతో నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి వారిని గెలిపించారు. అలా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.. అలాంటి వారంతా నేడు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారు. వైసీపీ ఓటమి.. టీడీపీ గెలుపు తథ్యం' అని మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం మండలంలోని మన్నీల గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పరిటాల సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు త్రిలోక్ నాయుడుతో పాటు అల్లు చంద్రమోహన్, విజయ్, ఈశ్వరయ్య, అల్లు రామాంజినేయులు, కుమారస్వామి, ఆనంద్, విక్రమ్, సాయి, కమతం ఆంజనేయులు, కుమార్‌రెడ్డి తదితర కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. మాజీ మంత్రి పార్టీలోకి చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. సర్పంచు మాట్లాడుతూ.. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ హయంలో గ్రామంలో ఒక్క పనిచేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఏ పనిచేయాలన్నా ఎమ్మెల్యే చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కనీసం గ్రామాలకు నిధులు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. సర్పంచు నిధులను సైతం పక్కదారి పట్టించారన్నారు. పరిటాల సునీత నాయకత్వంలో గ్రామాన్ని అభివృద్ధి చేయా లన్న ఉద్దేశంలో పార్టీలోకి చేరినట్లు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్షావలి నాయుడు, విజయ రాముడు, అల్లుగోపాల్, జయప్రకాష్, సుధాకర్‌నాయుడు, వెంకటనారాయణ, రాధాకృష్ణయ్య, చల్లానాయుడు, కొండయ్య, మీనాక్షినాయుడు, వారాధి, ఆంజనేయులు, ముల్ల పాటి కుమారస్వామి, వెంకటరాముడు, సూరి, గోపాల్, నల్లప్ప, రామ్మోహన్, బయ న్న, ప్రసాద్, రాము, శివయ్య పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


అయ్యవారిపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

**రాప్తాడు:** చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంచారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సాకే జయరాముడు, ఉప్పర శ్రీనివాసులు, బీరన్న, శ్రీనివాసులు, ప్రసన్న, స్వర్ణక్క పాల్గొన్నారు.

## ప్రైవేట్ టీచర్లకు శిక్షణ


▲ మాట్లాడుతున్న రామానాయుడు, శ్రీవాణి



హాజరైన కరస్పాండెంట్లు, టీచర్లు ▼

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 25:** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీపీయూ ఎస్ఎంఎ) ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులోని శ్రీ7 కన్వెషన్ సెంటర్‌లో జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే ప్రీ ప్రైమరీ, ప్రైమరీ టీచర్లకు టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాం (టీఈపీ)పై ఉదయం నుంచి సాయంత్రం వరకూ శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 160 మందికి పైగా కరస్పాండెంట్లు, 1600 మందికి పైగా ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రైనర్లు రామానాయుడు, వాణిశ్రీ మాట్లాడు తూ... ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పుస్తకాలు లేని బోధన సాగాలన్నారు.

ప్రధానంగా ఒత్తిడి లేని చదువులు అందించాలన్నారు. అంతేకాకుండా 5 లేదా 6 ఏళ్ల లోపు పిల్లలకు మాతృభాషలోనే బోధించాలని, ఇంగ్లీష్ కూడా మాతృభాషలో భాగమయ్యేలా బోధన అందించాలని అన్నారు. రోజువారీ పరీక్షలు విధానం కూడా కరెక్ట్ కాదన్నారు. సీసీఈ విధానంలోనే విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయాలని సూచించారు. చాలా స్కూళ్లలో హోం వర్క్ పేరుతో విద్యార్థుల బాల్యాన్ని యాజమాన్యాలు, టీచర్లు దోచేస్తు న్నాయన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పుస్తకాలు చదవడం, రాయడమే కాకుండా పిల్లలు సమాజంలో తిరిగేలా చూడాలని, బయటి విజ్ఞానం పెంచేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలని తెలిపారు. అప్పుడే విద్యార్థులు సులువుగా పాఠ్య పుస్తకాల జ్ఞానంతోపాటు, సమాజ జ్ఞానాన్ని సైతం ఆకలింపు చేసుకుంటారని సూచించారు.

అనంతరం అపస్మా జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు సులభ పద్ధతుల్లో బోధించే అనేక పద్ధతులపై టీచర్లకు ఉచితంగా శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,600 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు నాయుడు, సహాధ్యక్షులు బాబు, జిల్లా ప్రధానకార్యదర్శి చంద్ర, కోశాధికారి ఎంఎస్ ఇక్బాల్, చీఫ్ అడ్వైజర్ సంజీవరెడ్డి, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, ఇతర నాయకులు నాగవీరయ్య, నాగరాజు, రఘునాథరావు, నాగరాజు, శశిభూషణ్, బాబు పాల్గొన్నారు.

## వైభవంగా గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్ల

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దేవతామూర్తుల విగ్రహాలు, స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

**గార్లదిన్నె, ఫిబ్రవరి 25:** మండలంలోని కోటంక సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్రనామార్చన, మంత్ర పుష్పకం, ఏకవారురుద్రభిషేకం, ఆకుపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి 8 సమయంలో శ్రీ వల్లిదేవసేనా, శ్రీవారి కల్యాణమహోత్సవంను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దైవ దర్శనం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన 35 ఎత్తు అడుగుల ఎత్తు గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, 9 అడుగుల నంది విగ్రహం, 10 అడుగులు నాగుల పడగ విగ్రహాలు భక్తులను ఆకుట్టుకుంటున్నాయి.

### నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాక

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25:** అనంతపురంలో సోమవారం నిర్వహించనున్న కాంగ్రెస్ ఎన్నికల ప్రచార శంఖారావం సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు వస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ జరుగుతున్నట్లు కనిపిస్తున్నా ఆ పార్టీలన్నీ కేంద్రంలోనే బీజేపీ కనుసనల్లోనే పనిచేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, మతసామరస్యం కోసం కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి పనిచేయాలని నిర్ణయించాయన్నారు. అందులో భాగంగా సోమవారం అనంతపురంలోని జూనియర్ కాలేజీలో నిర్వహించనున్న కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

## వైసీపీకి ఓటేసిన వాళ్లకే నీళ్లు

### సర్పంచ్ భర్త వింత వాదన.. నిలదీసిన గ్రామస్థులు

**ఆత్మకూరు ఫిబ్రవరి 25:** 'గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఓటేసిన వాళ్ల ఇంటికే కొళాయి కనెక్షన్ ఇస్తాం... మీరంతా వైసీపీకి ఓటు వేయలేదు... దీంతో మీ ఇళ్లకు కొళాయి కనెక్షన్ ఇచ్చేది లేదు' అని మండలంలోని బీ యాలేరు గ్రామంలో సర్పంచ్ రేణుకమ్మ భర్త ఎర్రిస్వామి ఎస్సీ కాలనీ వాసులకు చెప్పడంతో వారు నివ్వెరపోయారు. బి యాలేరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పైపులైను ద్వారా ఇంటింటికి కొళాయి ఇస్తున్నారు. అయితే సర్పంచ్ రేణుకమ్మ భర్త ఎర్రిస్వామి దుగ్గరుండి కేవలం వైసీపీ మద్దతుదారుల ఇళ్లకు మాత్రమే కొళాయి కనెక్షన్లు ఇప్పిస్తూ... మిగిలిన వారికి ఇవ్వకుండా చేస్తున్నారు. దీనిపై ఆ కాలనీ వాసులు, టీడీపీ మద్దతుదారులు అతన్ని నిలదీశారు. కాసేపు వారి మధ్య వాగ్వాదం తలెత్తింది. దీంతో ఆగ్రహించిన ఆ కాలనీ వాసులు పనులను అడ్డుకున్నారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకొని.. అందరికీ న్యాయం జరిగిలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


సర్పంచ్ భర్తను నిలదీస్తున్న కాలనీవాసులు


మాట్లాడుతున్న యాతం పోతులయ్య

## పరిటాల సునీతకు టిక్కెట్టు కేటాయింపుపై హర్షం

**ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 25:** టీడీపీ రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి పరిటాల సునీతకు టికెట్టు కేటాయించడంపై కనగానపల్లి మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కనగానపల్లిలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో కన్వీనర్ యాతం పోతులయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్ మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ కష్టసుఖాల్లో అండగా ఉండేది పరిటాల కుటుంబమేనని, ఆ కుటుంబానికి చంద్రబాబునాయుడు టికెట్టు ప్రకటించడంపై బడుగు బలహీనవర్గాల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పరిటాల సునీత ఎమ్మెల్యే కాగానే గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముకుందనాయుడు, సుధాకర్‌చౌదరి, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, రాజాకృష్ణ, బిల్లేదాము, విజయ్, పూజారినాగభూషణం, సంజీవ్ పాల్గొన్నారు.

**28 నుంచి ప్రచారం:** ఈనెల 28 నుంచి కనగానపల్లి మండల వ్యాప్తంగా ఇంటింటా టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ యాతం పోతలయ్య తెలిపారు. 28న ముత్తవకుంట్ల, తల్లిమడుగు, 29న బాలేపాళ్యం, కోనాపురం, మార్చి 1న కేఎస్‌పాళ్యం, శివపురం, 2న పర్వతదేవరపల్లి, ముక్తాపురం, 3న తూముచెర్ల, సీఎస్‌కోట, 4న గుంతపల్లి, పాతపాళ్యం, 5న వేపకుంట గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### బండారు శ్రావణిశ్రీకి...

**శింగనమల, ఫిబ్రవరి 25:** శింగనమల టీడీపీ టికెట్‌ను బండారు శ్రావణిశ్రీకి ఇవ్వడం హర్షనీయమని రాష్ట్ర ఎస్సీఎస్టీ పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి బండారు కుళ్ళాయప్ప అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బండారు శ్రావణిశ్రీ కుటుంబం టీడీపీకి విధేయులని, చంద్రబాబు నాయుడు టీడీపీ మొదటి జాబితలోనే బండారు శ్రావణిశ్రీ పేరు ఇవ్వడం శుభపరిణామమని, తప్పకుండా బండారు శ్రావణిశ్రీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు గాయాలు

#### గ్రూపు-2 పరీక్ష రాయలేకపోయిన అభ్యర్థి


గాయపడిన నరసింహులు, హేమలత

**గార్లదిన్నె, ఫిబ్రవరి 25:** పట్టణంలో జేఎన్టీయూ సమీపంలో నివాసముంటున్న నరసింహులు తన కుమార్తె హేమలతను ఆదివారం గ్రూపు-2 పరీక్ష రాయించడానికి పెద్దవడుగూరు పరీక్ష కేంద్రానికి ద్విచక్ర వాహనంలో బయలు దేరాడు. గార్లదిన్నె మండలం కల్లూరుకు వెల్లగానే కేరళ నుంచి నాగపూర్‌కు వెలుతున్న లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొంది. ప్రమాదంలో నరసింహులు, హేమలత తీవ్రంగా గాయపడ్డారు. నరసింహులుకు ఎడమ కాలు, వెన్నముక, హేమలత కుడి చేయికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో పామిడికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపు రం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, గ్రూపు-2 పరీక్ష రాయలేపోయానని హేమలత వాపోయింది.

### శివరాత్రి వేడుకలను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆశ్రమ కార్యవర్గ సభ్యులు

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25:** మహాశివరాత్రిని పురస్కరించుకుని మార్చి 8, 9 తేదీల్లో శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో నిర్వహించనున్న వేడుకలను జయప్రదం చేయాలని ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆశ్రమ ఆవరణలో శివరాత్రి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. భక్తులు విరివిగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆలయ కార్యవర్గ సభ్యులు రత్నగిరి దేవరాజు, మల్లికార్జున, కేఎస్ ప్రసాద్, లక్ష్మీనారాయణ, మహేష్‌బాబు, గోపీకృష్ణ, భాను పాల్గొన్నారు.

### రేపట్నుంచి 'జగనన్న పాల వెల్లువ': జేసీ

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 25:** జిల్లాలో జగనన్న పాల వెల్లువ పథకాన్ని మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జేసీ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. ఆదివారం జగనన్న పాల వెల్లువ పథకంపై మెంటార్లు, అసిస్టెంట్ మెంటార్లు, రూట్ ఇన్‌చార్జిలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన మాట్లాడారు. పాడి రైతుల పాలకు న్యాయమైన ధరను అందించేందుకు మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్ల ద్వారా జగనన్న పాల వెల్లువ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, బుక్కరాయ సముద్రం, నార్పల మండలాల పరిధిలోని 54 ఆర్బీకేల పరిధిల్లోని 98 గ్రామాల్లో ఇప్పటికే ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లను పంపిణీ చేశామన్నారు. అధునాతన బిల్లింగ్ వ్యవస్థతో కూడిన పాల నాణ్యత కొలిచే యంత్రాల ద్వారా మంగళవారం నుంచి పాల సేకరణకు శ్రీకారం చుడుతున్నామన్నారు. పాల సేకరణలో నూతన ఒరవడి తెచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పథకం అమలులో క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలుంటే కంట్రోల్ రూం నెంబర్ 93919 09449ను సంప్రదించాలని సూచించారు.

### జేఎన్‌టీయూలో ఐఈఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

**అనంతపురం సెంట్రల్:** జేఎన్‌టీయూలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా (ఐఈఐ) రాష్ట్ర కార్యాలయానికి ఒక సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని ఆ సంస్థ సభ్యులు వీసీ శ్రీనివాసరావును కోరారు. ఆదివారం జేఎన్‌టీయూ ఎంబీఏ విభాగం సెమినార్ హాల్లో ఐఈఐ సమావేశాన్ని నిర్వహించారు. వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శశిధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో ఐఈఐ రాష్ట్ర ఛైర్మన్ శ్రీరామ్, గౌరవ కార్యదర్శి దేవకుమార్, స్థానిక కేంద్ర ఛైర్‌పర్సన్ శోభాబింధు, గౌరవ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సభ్యులు దిలీప్‌కుమార్, రవీంద్రబాబు, ప్రకాష్‌రావు, బాబూరావు, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కమిటీల ఎంపిక

**చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 25:** ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల నూతన కమిటీలను ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నేకొత్తపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఈ కమిటీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడిగా చిన్నముత్యాలప్ప, అధ్యక్షుడిగా జనార్దన్, ఉపాధ్యక్షుడిగా ఓబుళపతి, కార్తీక్, ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సహాయ ప్రధాన కార్యదర్శి రాజులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎంఎస్‌పీ నూతన మండల గౌరవాధ్యక్షుడిగా లింగమయ్య, అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా అమర్, ప్రధాన కార్యదర్శిగా వీరజిన్నయ్యలను ఎన్నుకోవడం జరిగిందన్నారు.


నూతన కమిటీల సభ్యులు

## భైరవాన్‌తిప్పకు కృష్ణాజలాలు అందించడమే లక్ష్యం

మాజీ మంత్రి కాలవ



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

**గుమ్మఘట్ట, ఫిబ్రవరి 25:** భైరవాన్‌తిప్పకు కృష్ణాజలాలను అందించడమే తన ఏకైక లక్ష్యమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తాళ్లకెర గ్రామంలో ఏర్పాటు చేసిన 'మనతో మన శీనన్న' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీటీప్రాజెక్టు అభివృద్ధి కోసం తాను ఎంపీగా ఉన్నప్పుడే రూ. ఆరుకోట్లు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మనం నీతిని నమ్ముకుని రాజకీయం చేస్తున్నామని, ప్రత్యర్థి పార్టీ నాయకులు అవినీతిని నమ్ముకుని అక్రమ వ్యాపారాల కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గతంలో టీడీపీలో ఉంటూ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ఏమి అభివృద్ధి చేయకపోగా తన వ్యాపా రాలను పెంచుకుని, భూములు కొనుగోలు చేస్తూ చిన్న, సన్నకార రైతులను ఇబ్బంది పెట్టాడన్నారు. తాను ఊపిరి ఉన్నంత వరకు రాయదుర్గంలోనే ఉంటూ, ఇక్కడి ప్రజల అభివృద్ధికి పాటు పడతానన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా తనను గెలిపిస్తే రాయదుర్గం అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానన్నారు. మెట్టు గోవిందరెడ్డి ఓట్లను అడిగేందుకు వస్తే తరిమి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ గిరిమల్లప్ప, కాలవ సన్నన్న, టీడీపీ యూత్ దళిత నాయకులు వెంక టేశులు, మత్స్యసహకార సంఘం అధ్యక్షులు శ్రీరాములు, సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంతరెడ్డి, క్యాతన్న, ఓబుళేశు, వెంకటేశులు, బొమ్మన్న, రామయ్య పాల్గొన్నారు.

### వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

**గుమ్మఘట్ట:** మండలంలోని తాళ్లకెర గ్రామంలో ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరాయి. వారికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు సదాశివ, దానవేంద్ర, కేపీదొడ్డి నాగరాజు, బీటీపీ ప్రాజెక్టు మాజీ చైర్మన్ కాలవ నాగరాజు, నీరగంటి తిమ్మప్ప, గొల్ల గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

### కల్లగళ్ల, జల్లిపల్లి గ్రామాల నుంచి...



పార్టీలో చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

**కూడేరు, ఫిబ్రవరి 25:** కూడేరు మండలంలో వైసీపీ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. వైసీపీ కంచుకోటగా ఉన్న గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు పెరిగాయి. ఆదివారం కూడేరు మండలం కల్లగళ్ళ, జల్లిపల్లి గ్రామాల్లో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీలోకి చేరడంతో టిడిపి సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు కండువాలు కప్పి ఆహ్వానించారు. కల్లగళ్ళ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు చెందిన దాదాపు 60 కుటుంబాలు, జల్లిపల్లి గ్రామంలో 10 దళిత కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరిని టిడిపి సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు కండువాలు కప్పి ఆహ్వానించారు.
**ఉరవకొండ:** వజ్రకరూర్ మండలంలోని పీసీ ప్యాపిలి తండాకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. పెద్ద కౌకుంట్ల గ్రామంలో ఆదివారం పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. రమేష్ నాయక్, భీమన్న నాయక్, సక్రినాయక్ తదితరులు పార్టీలో చేరారు.

## యువత బాధ్యతగా ఓటు వేయాలి

మాజీ శాసనసభ్యుడు జితేంద్రగౌడు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జితేంద్రగౌడు

**గుంతకల్లు, ఫిబ్రవరి 25:** యువత సార్వత్రిక ఎన్నికల్లో బాధ్యతగా ఓటు వెయ్యాలని మాజీ శాసనసభ్యుడు జితేంద్రగౌడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని 26వ వార్డులో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. వచ్చే ఎన్నికలు అత్యంత కీలకమైనవని, రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయన్నారు. ఒక్కసారి అంటూ జగన్ చేసిన కల్లబొల్లి ప్రచారాలకు మోసపోయి ఓటు వేశారని, ఐదేళ్లలో రాష్ట్ర పరిస్థితి అంధకారంలోకి వెళ్లిపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడు, నాయకులు అనిల్‌కుమార్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, కౌన్సిలరు గుడిపాటి ఆంజనేయులు, హనుమంతు, గిడ్డయ్య, రాయల్ వెంకటేశులు, భాస్కర్, లక్ష్మయ్య యాదవ్, బండి లక్ష్మిదేవి, మాధవి పాల్గొన్నారు.

## శివమాలధారులకు భిక్ష ఏర్పాటు



శివస్వాములకు అన్నదానం చేస్తున్న వెంకటశివుడు యాదవ్

**గుంతకల్లు, ఫిబ్రవరి 25:** శ్రీశైల మల్లికార్జునుడి దర్శనార్థం పాదయాత్రగా వెళ్తున్న శివ మాలధారులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ ఆదివారం మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేశారు. మండలంలోని పాతకొత్తచెరువు గ్రామ దర్గాకు సమీపంలో గుంతకల్లు నియోజకవర్గం నుంచి శ్రీశైలం వెళ్తున్న శివస్వాములకు భోజన వసతిని కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## బొమ్మనహాళ్‌లో టీడీపీ సంబరాలు

**బొమ్మనహాళ్, ఫిబ్రవరి 25:** మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని టీడీపీ సీనియర్ నాయకులు సింగల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున ఆధ్వర్యంలో శ్రేణులు సంబరాలు చేశారు. రాయదుర్గం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులును ప్రకటించడంతో బొమ్మనహాళ్‌లోని పాండురంగస్వామి ఆలయంలో పూజలు జరిపించి సాయంత్రం టపాసులు పేల్చి పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ మహేంద్ర, టీడీపీ నాయకులు మజ్జిగ నాగరాజు, శీన, రవి పాల్గొన్నారు.

### 'జయహో బీసీ'ని విజయవంతం చేయండి

**రాయదుర్గం, ఫిబ్రవరి 25:** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, రాయదుర్గం నియోజకవర్గ టీడీపీ శాసనసభ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు హాజరుకానున్నారన్నారు. సోమవారం మద్దానేశ్వర స్వామి దేవాలయంలో నాలుగు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# అటకెక్కిన 'మిషన్ వాత్సల్య'

ముందుకు కదలని అర్హుల ఎంపిక ప్రక్రియ

పథకం అమలుపై కమ్ముకున్న నీలినీడలు




**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 25:** విధి వంచితులకు కొండంత అండగా నిలవాల్సిన మిషన్ వాత్సల్య పథకం అతీగతి లేకుండా పోయింది. ఆర్థికసాయం వస్తుందని ఎనిమిది నెలలుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. తల్లిదండ్రులు లేని 18 ఏళ్ల లోపు అనాథ పిల్లలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారుల చదువుకు ఉపయోగపడేలా ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టారు. గత ఏడాది ఏప్రిల్ 2న ప్రకటన విడుదల చేసి ఐసీడీఎస్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. నెలకు రూ. 4 వేల చొప్పున ఆర్థికసాయం అందించాలని నిర్ణయించారు. విస్తృత ప్రచారం చేయడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఎనిమిది నెలలైనా పథకం విధి విధానాలపై స్పష్టత లేదు. అర్హుల ఎంపిక ప్రక్రియ ఆటకెక్కింది. పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

### అభాగ్యుల ఎదురుచూపులు

దరఖాస్తులను పరిశీలించిన అధికారులు కొన్నింటిని తిరస్కరించారు. భార్యాభర్తలు విడాకులు పొందినట్లయితే వీఆర్వో నుంచి ధ్రువపత్రం అందిస్తే పథకం వర్తిస్తుందని తొలుత చెప్పి, తరువాత కోర్టు నుంచి విడాకులు పొందని వారివి తిరస్కరించారు. ధ్రువీకరణ పత్రాల్లో పేరు, చిరునామా, ఇతర వివరాల్లో చిన్న తేడా ఉన్నా దరఖాస్తులను వెనక్కి పంపారు. మరణించిన తల్లి, తండ్రి ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాల్లో తేడాలున్నా పక్కన పెట్టారు. తొలుత కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పిన అధికారులు తరువాత ఇద్దరికీ మాత్రమే అవకాశం ఉందని తేల్చారు. అర్హుల దరఖాస్తులను ఐసీడీఎస్ పీడీ కార్యాలయానికి పంపారు. అక్కడ నుంచి ఐసీడీఎస్ రాష్ట్ర సంచాలకుడి దగ్గరకు వెళ్లాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు రాక ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం.

**కాళ్లరిగేలా తిరిగి..**

కళ్యాణదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కళ్యాణదుర్గం మండలం, కళ్యాణదుర్గం రూరల్, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాల పరిధిలో 950 దరఖాస్తులు, కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాల పరిధిలో 1526 దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో అవగాహన లేకపోవడంతో కొందరు తల్లిదండ్రులు పుట్టిన తేదీలు నమోదు చేయించలేదు. అటువంటి వారికి జనన ధ్రువీకరణ పత్రాలు లభించక పథకానికి దూరమయ్యారు. ఆదాయ, కుల, మరణ, ఇతర ధ్రువీకరణ పత్రాలతోపాటు కొత్తగా బ్యాంకు ఖాతా తెరిచి లబ్ధిదారులు వ్యయప్రయాసలకోర్చి దరఖాస్తులు సమర్పించారు. ముఖ్యంగా కాళ్లరిగేలా ధ్రువపత్రాల కోసం తిరిగారు. ఇప్పుడు అర్హులను ఎంపిక చేయకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

### నిధులు విడుదల కాలేదు

మిషన్ వాత్సల్యకు సంబంధించిన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 30 వేల పైబడి దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాం. అయితే కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందిన తర్వాతనే నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. నిధులు ఎప్పుడు మంజూరు అవుతాయో చెప్పలేకపోతున్నాం.

**- డాక్టర్ బీఎన్ శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్, అనంతపురం**

## వైభవంగా ఏటిగంగమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**ఉరవకొండ, ఫిబ్రవరి 25:** మండలం పరిధిలోని పెన్నహోబిలం పెన్నానది వద్ద ఆదివారం ఏటిగంగమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ప్రతియేటా మాఘమాసం మూడవవారం ఏటిగంగమ్మ తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీ. అశ్వర్థనారాయణ కట్టకు భక్తులు పూజలను చేశారు. ఏటిగంగమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవమూర్తిని మేళతాళాల మధ్య ఊరేగించారు. పెన్నానదిలో భక్తులు స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెన్నానది ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఖోఖో సంఘం జిల్లా చైర్మెన్ భీమిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆకుకూరల నాగరాజు, వార్డుమెంబర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

### శింగరప్పకు ప్రత్యేక పూజలు



**పామిడి, ఫిబ్రవరి 25:** పట్టణంలోని పెన్నానది ఒడ్డున వెలసిన క్షేత్రపాల కొండ శింగరప్పస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో శింగరప్ప స్వామికి వేకువజామునే పంచామృతాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని నెమళ్లపల్లి, వంకరాజుకాలువ, సొరకాయలపేట, ఎద్దులపల్లి, పీ కొత్తపల్లి, పీ కొండాపురం, జీ కొట్టాల, దేవరపల్లి తదితర గ్రామాల నుంచి ఎద్దులబండ్లు, ట్రాక్టర్లలో తెల్లవారుజామునే భక్తులు తరలివచ్చారు. పెన్నానదిలో స్నానమాచరించి కొబ్బరికాయలు సమర్పించారు. ఆలయం పరిసర ప్రాంతాలలో అంగళ్లు వెలిశాయి. వచ్చిపోయే భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రతి ఏడాది మాఘమాసం మూడవ ఆదివారం శింగరప్ప తిరునాళ్ల జరుపడం ఆనవాయితీగా వస్తోంది.

### ముగిసిన బూదిగుమ్మ ఉత్సవాలు



**బెళుగుప్ప, ఫిబ్రవరి 25:** మండలంలో రెండురోజులపాటు సాగిన బూదిగుమ్మ తిరునాళ్లు ఆదివారం ముగిశాయి. పెన్నానది ఒడ్డున ఉన్న బూదిగుమ్మ, వీరాంజనేయ కొట్టాల, కాలువపల్లి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా తిరునాళ్లను జరుపుకున్నారు. పెన్నానదిలో మాఘ స్నానమాచరించి, గంగమ్మకు పూజ చేసి ఆంజనేయస్వామి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాలువపల్లి వద్ద ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తీర్థ ప్రసాదాల వినియోగంతో తిరునాళ్ల ముగిశాయి. పెన్నానది ఒడ్డున ఎస్‌ఐ శివ తమ సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు.

### భక్తులతో కిటకిటలాడిన అశ్వత్థం



ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వరస్వామి

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి 25:** మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వర స్వామి ఆలయ తిరుణాళ్ల వైభవంగా జరిగింది. మాఘమాసం మూడవ ఆదివారం పురస్కరించుకొని అశ్వత్థ నారాయణ స్వామి, భీమలింగేశ్వరునికి అభిషేకం, అర్చనలతోపాటు విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. మూడవ ఆదివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలిరావడంతో అశ్వత్థక్షేత్రం కిటకిటలాడింది. వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పలు సేవా సంస్థలు అన్నదాన కార్యక్రమాలు, మంచి నీటి సరఫరా చేపట్టాయి.

### నేడు ప్రసన్న పార్వతీ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవం



**పామిడి, ఫిబ్రవరి 25:** పట్టణంలోని భోగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ప్రసన్న పార్వతీ భోగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవాన్ని రెండురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే మొదటి రోజు గణపతి దుర్గా సహిత శ్రీ రుద్రస్వాహాకార హోమం చేపట్టారు. సోమవారం స్వామి వార్లకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తామని శివదీక్షాధారులు పేర్కొన్నారు. కల్యాణోత్సవ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

### అశ్వవాహనంపై భక్తులకు కనువిందు



**గుత్తిరూరల్, ఫిబ్రవరి 25:** మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేతుడైన రంగనాథుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వి విధ పుష్పాలతో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం చిన్న రథంపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చి భక్తులు జమ్మిచెట్టు వరకు లాగారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ దేవదాసు, ఆలయ అర్చకులు రవి స్వామి, చేతన్ వర్మ, లికిల్ వర్మ, నవీన్, ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవం.. భగళాముఖి రథోత్సవం



**ఉరవకొండ, ఫిబ్రవరి 25:** మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం భగళాముఖీ అమ్మవారి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకుని వచ్చి రథంలో ఉంచి రథాన్ని ఆలయం నుంచి సింహకట్ట వరకూ లాగారు. రథంపైకి భక్తులు అరటి పళ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రథాన్ని యథాస్థానానికి చేర్చారు.

### పాత పెన్షన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి: యూటీఎఫ్

**ఉరవకొండ, ఫిబ్రవరి 25:** ఎన్నికల నేపథ్యంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీని టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. యూటీఎఫ్ కమిటీ పిలుపు మేరకు ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజినేయులు, వెంకటేశులుకు యూటీఎఫ్ నాయకులు రామప్పచౌదరి, శేఖర్ వినతిపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ అయితే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీని ఇస్తుందో వారికే ఉద్యోగ ఉపాధ్యాయులందరూ మద్దతు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, ఉమాపతి, రఘు, జయరాములు లక్ష్మినారాయణ, వేణుగోపాల్, మోహన్, బాషా పాల్గొన్నారు.

### పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య

**కుందుర్పి, ఫిబ్రవరి 25:** పెళ్లికాలేదని మనస్థాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం కుందుర్పి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుందుర్పి మండల కేంద్రానికి చెందిన మంజునాథ్ (34) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. తండ్రిని తనకు వివాహం చేయాలని అడిగేవాడు. అయితే నీకు ఆరోగ్యం సరిగాలేదని, వివాహం చేసుకోవడానికి ఎవరూ ముందుకు రారని తండ్రి చెబుతుండేవాడు. దీంతో మనస్థాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం లేచి తండ్రి తలుపులు తీసేందుకు ప్రయత్నించగా ఎంతసేపటికీ తెరవకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో వెనుకవైపు వున్న తలుపుబద్దలు కొట్టి లోపలికి వెళ్లిచూసేసరికి కుమారుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి నారాయణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**పుట్లూరు, ఫిబ్రవరి 25:** మండలకేంద్రంలో తలారి తిరుమలయ్య (45) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 21న మద్యం మత్తులో ఒంటికి నిప్పుపెట్టుకున్నాడు. గాయాలు కాగా కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

### ఇరువర్గాల ఘర్షణ... పలువురికి గాయాలు

**గుత్తిరూరల్, ఫిబ్రవరి 25:** మండలంలోని తొండపాడు గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడి పలువురికి గాయాలయ్యాయి. మండలంలోని వన్నేదొడ్డి, శ్రీపురం గ్రామాలకు చెందిన పలువురు యువకులు తిరునాళ్లల్లో ఘర్షణ పడ్డారు. శ్రీపురానికి చెందిన శివ, సుభాష్, గోవర్ధన్, రజాపురానికి చెందిన నరేంద్రబాబు, దుర్గా, ఎర్రిస్వామి, రమేష్, వెంకీ పరస్పరం కర్రలతో దాడుల చేసుకున్నారు. గాయాపడిన వారిని వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.
**గుత్తిరూరల్:** మండలంలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జక్కలచెరువు గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తొండపాడు గ్రామానికి చెందిన వెంకటేష్, వన్నేదొడ్డి గ్రామానికి చెందిన సాయి ఇద్దరు ద్విచక్రవాహనంలో జక్కలచెరువు వస్తుండగా గ్రామశివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా కొత్తపేట గ్రామశివారులో 44వ జాతీయ రహదారిపై డోన్‌కు చెందిన విజయకుమార్ ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. టీ కొత్తపల్లి గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై ఇసురాళ్లపల్లికి చెందిన లక్ష్మినారాయణ, ఆటోలో గుత్తికి వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**కుందుర్పి:** మండల పరిధిలోని జంబగుంపల గ్రామానికి చెందిన బోయ బాలరాజు(24) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. బాలరాజు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం చెక్‌డ్యామ్ సమీపంలో అతిగా మద్యం తాగి మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వెంకటస్వామి దర్యాప్తు చేస్తున్నారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

**పుట్లూరు, ఫిబ్రవరి 25:** మండలంలోని చాలవేముల గ్రామంలో వివాహిత మహాలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతో ఇంటిలోని క్రిమిసంహారక మందు తాగడంతో తాడిపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు తెలిపారు.

### గ్రూప్-2 పరీక్ష కేంద్రాల తనిఖీ

**కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 25:** గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను ఆర్డీవో రాణి సుష్మిత, ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును ఆదివారం పరిశీలించారు. పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలకు గాను 1302 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి వుండగా ఇందులో 196 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు.
**గుత్తి:** పట్టణంలో ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. 9 కేంద్రాలలో 1808మంది అభ్యర్థులకు గాను 466 మంది అభ్యర్థులు గైహాజరయ్యారు. 1442 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.
**గుంతకల్లుటౌన్:** పట్టణంలో గ్రూప్-2 పరీక్షల ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఉదయం 9.30గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పోలీసులు, అధికారులు అభ్యర్థులను పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మొత్తం 2040 మంది అభ్యర్థులకు గాను 1517మంది హాజరయ్యారు.
**ఉరవకొండ:** పట్టణంలో గ్రూప్-2 ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉరవకొండలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, మహాత్మా డిగ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వివేకానంద ఇంగ్లీషు మీడియం పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలలో నిర్వహించారు. ఉదయం 8 గంటలకే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 1284 మంది గాను 937 మంది హాజరయ్యారు. 347 మంది గైర్హాజరైయ్యారు. పరీక్ష కేంద్రాలను సీఐ తిమ్మయ్య తనిఖీ చేశారు.

### విజయవంతం చేయండి

**రాయదుర్గం, ఫిబ్రవరి 25:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనంతపురంలో సోమవారం నిర్వహించే ఆంధ్ర రాష్ట్ర పునఃనిర్మాణ పోరాట సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నప్పయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సభకు ఏపీసీసీ అధ్యక్షులు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షులు షర్మిలరెడ్డి, సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రమరాజు పాల్గొంటున్నట్లు తెలిపారు.

### నేటి నుంచి ఉరుసు

**రాయదుర్గం, ఫిబ్రవరి 25:** పట్టణంలోని కొండపై వెలసిన హజరత్ సయ్యద్ జాఫర్ షావలి దర్గా 282వ ఉరుసు మహోత్సవాలు సోమవారం రాత్రి నుంచి 29వ తేదీ వరకు జరగనున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున గంధం ఊరేగింపు ఉంటుందని, అదేరోజు రాత్రి ఖవ్వాలి నిర్వహిస్తారన్నారు. బుధవారం తెల్లవారుజామున పట్టణంలో షంషీర్ ఊరేగింపు ఉంటుందని, గురువారం జియారత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా హరీష్‌రెడ్డి



**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 25:** బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన హరీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన గతంలో వీరాపురం గ్రామ మాజీ సర్పంచు, ఉమ్మడి జిల్లా బీజేవైఎం మాజీ అధ్యక్షుడుగా సేవలందించారు. ఈయన సేవలను గుర్తించి పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమించింది. హరీష్‌రెడ్డి నియామకం పట్ల పార్టీలో ముఖ్యులు, నాయకులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

**పుట్లూరు, ఫిబ్రవరి 25:** మండలంలోని రంగమనాయునిపల్లిలో మంగళవారం నుంచి మూడురోజుల పాటు సీతారామాంజనేయస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 27న యాగశాల ప్రవేశం, గణపతి పూజ, 28న గోపూజ, జలాధివాసం, 29న విగ్రహాల ప్రతిష్ఠతోపాటు మూడురోజులు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

### సంఘం ఏర్పాటు

**రాయదుర్గం, ఫిబ్రవరి 25:** పట్టణంలో ఆదివారం వెల్డింగ్ షాపుల యజమానుల సంఘాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా బీ ఖాసీం, ప్రధాన కార్యదర్శిగా జఫ్రుల్లాఖాన్ గౌరవ అధ్యక్షులుగా షమీవుల్లా, సత్యనారాయణ, బట్టి రహంతుల్లా, ఖాసీంపీరా, సహాయ కార్యదర్శిగా పీరా, కోశాధికారిగా కణేకల్లు భాస్కర్, కమిటీ సభ్యులుగా ఎల్ మహ్మద్‌షఫీ, సయ్యద్ షరీఫ్, సత్తార్, ఇబ్రహీం, చమ్మా ఇమ్రాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### 0.466 టీఎంసీల నీటి నిల్వ

**బెళుగుప్ప, ఫిబ్రవరి 25:** మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.459 టీఎంసీల నీరు నిల్వ వుందని ఆదివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 816 క్యూసెక్కులు వుండగా, ఫేజ్-2కు ఔట్ ఫ్లో కింద 750 క్యూసెక్కులు వెళుతుందని వెల్లడించారు.

### జీవనోపాధి కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు: చవ్వా

**యాడికి, ఫిబ్రవరి 25:** గ్రామీణ మహిళల జీవనోపాధి కోసం ఉచితకుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని నిట్టూరు గ్రామంలో చవ్వా ఆదినారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితకుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిట్టూరు సర్పంచు ఈశ్వరమ్మ, టీడీపీ నాయకులు రాజారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, సత్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### గెలుపునకు పనిచేస్తాం: టీడీపీ

**యల్లనూరు:** టీడీపీ అధిష్ఠానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి గెలుపునకు కలిసికట్టుగా పనిచేస్తామని మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తిరుమలాపురంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కలిసికట్టుగా ప్రచారాన్ని ప్రారంభించి గెలుపునకు కృషి చేద్దామన్నారు. సమావేశంలో చిలమకూరు రత్నమయ్య, దస్తగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

### అపూర్వ కలయిక

**పామిడి:** పట్టణంలోని చిన్నప్ప శ్రేష్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003 పదవ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థుల కలయిక ఆదివారం ఆహ్లాదకరంగా జరిగింది. సాయంత్రంవేళ పూర్వ విద్యార్థులందరూ కలిశారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో